

చంద్రబాబు తిరుగు ప్రయాణం

విశాఖపట్నం, ఫిబ్రవరి 26: శ్రీకాకుళం జిల్లా పర్యటన ముగించుకుని హైదరాబాద్ ప్రయాణమైన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు సోమవారం రాత్రి విమానాశ్రయంలో పార్టీ నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. చంద్రబాబు శ్రీకాకుళం నుంచి రోడ్డు మార్గంలో రాత్రి 8.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే వెలగపూడి, పార్టీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు, పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, నాయకులు ఎం.శ్రీభరత్, వంగలపూడి అనిత, పీలా గోవిందసత్యనారాయణ, పప్పల చలపతిరావు తదితరులు వీడ్కోలు పలికారు.



వైవీ సుబ్బారెడ్డి ప్రసంగిస్తుండగా వెనుక భాగంలో ఖాళీ అయిన గ్యాలరీ



విమానాశ్రయంలో చంద్రబాబునాయుడుకు వీడ్కోలు పలుకుతున్న పీలా గోవింద, పీలా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, కోరాడ రాజబాబు, గుమ్మడి సంధ్యారాణి, రామ్మోహన్‌నాయుడు, శ్రీభరత్, కనకమేడల రవీంద్రబాబు

వైవీ సుబ్బారెడ్డి ప్రసంగిస్తుండగా
గ్యాలరీ ఖాళీ

అనకాపల్లిలోని రావు గోపాలరావు కళాక్షేత్రంలో సోమవారం నియోజకవర్గం వైసీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా పార్టీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఆయన ప్రసంగిస్తుండగానే కళాక్షేత్రంలోని వెనుక భాగంలో గ్యాలరీలు ఖాళీ అయ్యాయి. ఈ విషయాన్ని వైసీపీ నాయకులు, కార్యకర్తలు గమనించి.. సభ నుంచి బయటకు వెళ్లేవారిని ఆపేందుకు యత్నించినా ఉపయోగం లేకుండా పోయింది.

(ఆంధ్రజ్యోతి- అనకాపల్లి)

రాజుకుంటున్న రాజకీయ వేడి

అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేసిన ప్రధాన పార్టీలు

- టీడీపీ-జనసేన కూటమి తరపున బరిలోకి కొణతాల
- జిల్లా కేంద్రంలో కార్యాలయం ఏర్పాటు
- నేతలు, పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశాలు
- వైసీపీ టికెట్ మలసాల భరత్‌కు ఖాయం చేసిన అధిష్ఠానం
- విస్తృతస్థాయి సమావేశంలో స్పష్టం చేసిన వైవీ సుబ్బారెడ్డి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులను ఖరారు చేస్తుండడంతో జిల్లాలో ఎన్నికల వేడి రాజుకుంది. అధికార వైసీపీ అనకాపల్లి, పాయకరావుపేట నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను గతంలోనే నియమించింది. తాజాగా అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాలకు తెలుగుదేశం-జనసేన పార్టీలు ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించాయి. ప్రధానంగా జిల్లా కేంద్రమైన అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ, టీడీపీ-జనసేన కూటమి తరపున పోటీ చేసే అభ్యర్థులు దాదాపు ఖాయం కావడంతో ఎన్నికల ప్రచారంపై దృష్టి సారించారు.

జనసేన పార్టీలో చేరిన ఐదు వారాల్లోనే కొణతాల రామకృష్ణ అనూహ్యంగా అనకాపల్లి ఎమ్మెల్యే టికెట్ సాధించారు. రాజకీయ వర్గాల అంచనాలకు అందకుండా తొలిజాబితాలో, అందునా అనకాపల్లి నియోజకవర్గం టికెట్ కేటాయించడం విశేషం. కొణతాల



కొణతాల రామకృష్ణ (జనసేన)



మలసాల భరత్ (వైసీపీ)

రామకృష్ణ జనవరి 17న జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిసిన వచ్చిన తరువాత నుంచి ఎక్కువ సమయం అనకాపల్లి నియోజకవర్గంలోనే ఉంటున్నారు. పట్టణంలోని టీచర్ కాలనీలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, పాత పరిచయాలున్న నాయకులతో సమావేశం అవుతున్నారు. గతంలో రైవాడ నీరు రైతులకే అన్న నినాదంతో చేపట్టిన పాదయాత్రలో తనవెంట నడిచిన నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులను కలుస్తున్నారు. త్వరలో టీడీపీ, జనసేన అధినేతలను అనకాపల్లికి ఆహ్వానించి ఇక్కడ భారీ బహిరంగా సభను ఏర్పాటు చేస్తానని ఆయన చెబుతున్నారు.

ఇదిలావుండగా అనకాపల్లి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి బాగులేదని సొంత సర్వే సంస్థల నివేదికల ద్వారా గుర్తించిన వైసీపీ అధిష్ఠానం.. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పక్కనబెట్టింది. నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా మలసాల భరత్‌కుమార్ పేరును సుమారు రెండు నెలల క్రితమే ప్రకటించింది. అయితే రెండు రోజుల క్రితం టీడీపీ-జనసేన పార్టీలు 99 మందితో ఉమ్మడి జాబితాను విడుదల చేయడంతో అధికార పార్టీ డైలమాలో పడింది. ప్రస్తుత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు ఫైనల్ కాదని, వచ్చే నెల మూడో తేదీ తరువాత అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలతో అనకాపల్లి సమన్వయకర్త భరత్‌కు టికెట్ కేటాయింపుపై పార్టీ వర్గాల్లో చర్చ మొదలైంది. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ సీనియర్ నేత కావడంతో ఎన్నికల్లో ఆయనను ఎదుర్కోవాలంటే రాజకీయాల్లోకి కొత్తగా వచ్చిన భరత్ కాకుండా, కొణతాల సామాజిక వర్గానికి చెందిన మరో సీనియర్ నేతనే బరిలోకి దించే అవకాశాలున్నాయని పార్టీ వర్గీయులు భావించారు. కానీ ఈ ఊహాగానాలకు ముగింపు ... మిగతా 8వ పేజీలో

ఈసారి లక్ష్యానికి దూరమే!

మార్చి 5తో ముగియనున్న గోవాడ షుగర్స్ క్రషింగ్

ఇంతవరకు ఫ్యాక్టరీకి 1.33 లక్షల టన్నుల చెరకు మాత్రమే సరఫరా

- ప్రస్తుత సీజన్ లక్ష్యం రెండు లక్షల టన్నులు
- తగ్గిన చెరకు సరఫరా
- గడువునాటికి 1.5 లక్షల టన్నులకు మించని పరిస్థితి

చోడవరం, ఫిబ్రవరి 26:

చెరకు క్రషింగ్ లక్ష్యంలో గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఈ ఏడాది కూడా చతికిలపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుత సీజన్‌లో రెండు లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇంతవరకు లక్షా 33 వేల టన్నుల చెరకు మాత్రమే ఫ్యాక్టరీకి సరఫరా అయ్యింది. మరోవైపు చెరకు క్రషింగ్‌ను వచ్చే నెల 5వ తేదీతో ముగించనున్నట్టు షుగర్స్ యాజమాన్యం ప్రకటించింది.

గోవాడ సహకార చక్కెర కర్మాగారంలో దశాబ్దం క్రితం వరకు ఏటా ఐదు లక్షల టన్నుల చెరకు క్రషింగ్ జరిగేది. 2018-19 సీజన్ వరకు (మధ్యలో ఒక ఏడాది మినహా) 4.5 లక్షల టన్నులకు తగ్గేది కాదు. కానీ వైసీపీ ప్రభుత్వ సహకారం లేకపోవడం, చెరకు రైతులకు డబ్బులు చెల్లించడంలో తీవ్ర జాప్యం, పెరుగుతున్న పెట్టుబడులతో పోలిస్తే మద్దతు ధర తక్కువగా వుండడంతో రైతులు క్రమేణా చెరకు సాగు తగ్గించేస్తున్నారు. ఫ్యాక్టరీ నడవాలన్న సంకల్పంతో పలువురు రైతులు చెరకు సరఫరా చేస్తున్నప్పటికీ, పేమెంట్లు సకాలంలో ఇవ్వకపోవడంతో చెరకు సాగుకు దూరం అవుతున్నారు. మరోవైపు బెల్లం ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో చెరకు సాగు విస్తీర్ణం నానాటికీ పడిపోతున్నది. ఈ కారణాల వల్ల గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరకు సాగు తగ్గిపోయి.. ఆ ప్రభావం క్రషింగ్ లక్ష్యంపై పడుతున్నది. ముఖ్యంగా 2019-20 (వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత) నుంచి చెరకు గానుగాట క్రమేపీ తగ్గుతున్నది. 2018-2019లో 4,79,157 టన్నుల చెరకు క్రషింగ్ జరగ్గా.. 2019-20 సీజన్‌లో 3,79,009 టన్నులకు (సుమారు లక్షల టన్నులు తక్కువ) పడిపోయింది. 2020-21లో 3,67,001 టన్నులు, 2021-22లో సీజన్‌లో 2,91,690 టన్నులు, గత సీజన్ (2022-23)లో 2,21,267 టన్నులు క్రషింగ్ జరిగింది. 2023-24 సీజన్‌లో వర్షాభావ పరిస్థితులతోపాటు చెరకు సాగు విస్తీర్ణం ... మిగతా 8వ పేజీలో



గోవాడ ఫ్యాక్టరీ ఆవరణలో చెరకు ట్రాక్టర్లు

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో గత పుష్కర కాలంలో చెరకు క్రషింగ్ గణాంకాలు

క్రషింగ్ సీజన్	ఫ్యాక్టరీకి వచ్చిన చెరకు (టన్నుల్లో)
2010-11	5,46,838
2011-12	5,30,855
2012-13	4,94,913
2013-14	5,50,975
2014-15	4,61,378
2015-16	4,77,918
2016-17	3,28,466
2017-18	4,31,333
2018-19	4,79,157
2019-20	3,79,009
2020-21	3,67,001
2021-22	2,91,690
2022-23	2,21,267

కదం తొక్కిన సర్పంచులు

కలెక్టరేట్ ఎదుట ఆందోళన

- ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వ తీసేసుకోవడంపై ఆగ్రహం
- పంచాయతీల బ్యాంకు ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలని డిమాండ్
- 16 డిమాండ్లపై జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం
- ఇదే సమయంలో కలెక్టరేట్ నుంచి బయటకు వచ్చిన మంత్రి అమర్, వైవీ సుబ్బారెడ్డి
- వినతిపత్రాలు ఇవ్వబోగా.. అడ్డుకున్న పోలీసులు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సర్పంచులు

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 26:

గ్రామ పంచాయతీలకు సంబంధించి పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు.

పలు డిమాండ్లకు సంబంధించి సర్పంచులు చేసిన నినాదాలతో కలెక్టరేట్ ప్రాంగణం హోరెత్తింది. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీల సర్పంచుల సంఘం అధ్యక్షురాలు చింతకాయల సుజాత మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీలు వినియోగించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రజలు ఎన్నుకున్న సర్పంచుల సంతకాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిని ఆర్థిక సంఘం నిధులను తీసేసుకుని, తమ సొంత అవసరాలకు, పథకాలకు వాడేసుకుంటున్నదని ఆరోపించారు. గ్రామాల అభివృద్ధికి కేంద్రం నేరుగా ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం దొంగిలిస్తున్నదని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. క్లాప్ మిత్రలకు గతంలో మాదిరిగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాన్ని రూ.15 వేలకు పెంచాలని కోరారు. మొత్తం 16 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ జాహ్నవికి అందజేశారు.

అంతకుముందు కలెక్టరేట్ ఎదుట సర్పంచులు ఆందోళన చేస్తున్న సమయంలో వైసీపీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ కలెక్టరేట్‌లోకి వెళ్లి వస్తుండగా సర్పంచులు అడ్డుకున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ క్రమంలో సుబ్బారెడ్డికి, మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రాలు ఇచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ... మిగతా 8వ పేజీలో



మంత్రి అమర్, వైసీపీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిలకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచులు

నేటి నుంచి టెట్

- ఉమ్మడి జిల్లాలో 37,556 మంది అభ్యర్థులు
- తొమ్మిది కేంద్రాలు ఏర్పాటు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మంగళవారం నుంచి జిల్లాలోని తొమ్మిది కేంద్రాల్లో ప్రారంభం కానున్నది. వచ్చే నెల ఆరో తేదీ వరకూ ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండు సెషన్‌లలో జరగనున్నది. ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరగనున్న ఈ పరీక్షకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి 37,556 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాలుగా గాయత్రి ఇంజనీరింగ్ కళాశాల (మధురవాడ), చైతన్య ఇంజనీరింగ్ కళాశాల (కొమ్మాది), నోబెల్ ఇంజనీరింగ్ కళాశాల (లంకెలపాలెం దరి మంత్రిపాలెం), ఐయాన్ డిజిటల్ జోన్ -1,2 (చినముషిడివాడ), ఐయాన్ డిజిటల్ జోన్ (షీలానగర్), జెన్ టెక్నాలజీస్ (చాణక్యనగర్, చినముషిడివాడ), ఎస్‌వీఎస్ టెక్నాలజీస్ (బీసీ రోడ్, పెదగంట్యాడ), ఏడీజడ్ డిజిటల్ జోన్ (శివాలయం ఎదురుగా, బుచ్చిరాజుపాలెం)ను ఎంపిక చేశారు. అభ్యర్థులు గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

సిటీ క్లబ్ అక్రమ నిర్మాణాలపై చర్యలు ఏవీ?

- మునిసిపల్ కమిషనర్‌ను నిలదీసిన ఆర్డీవో
- గతంలో చెప్పినా పట్టించుకోలేదంటూ ఆగ్రహం
- వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశం

-వార్త 7వ పేజీలో

రైల్వే అభివృద్ధి పనులు ప్రారంభం

దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలోని అనకాపల్లి జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడానికి ఎల్ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో రూ.13.13 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ములకలాపల్లి, తురంగలపాలెం, దార్లపూడి పెదబోదిగల్లం, పీఎల్‌పురం, నామవరం వద్ద రైల్వే అండర్ పాస్ వంతెలను ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో రైల్వే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

- 7లో



ఎలమంచిలి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, జనసేన నేత సుందరపు విజయకుమార్, రైల్వే అధికారులు

క్రైం... crime news

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


గొంపా శ్రీను(ఫైల్)

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 26: మండలంలోని ధర్మసాగరం గ్రామంలో అప్పుల బాధతో నూతిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు రూరల్ ఎస్ఐ భీమరాజ్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ధర్మసాగరానికి చెందిన గొంపా శ్రీను(38) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీను తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతని కోసం పలుచోట్ల వెతికారు. అయినా ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలో గల నూతిలో శవమై తేలి ఉన్న మృతదేహాన్ని గ్రామానికి చెందిన లక్ష్మణ గుర్తించి గ్రామస్థులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అది శ్రీను మృతదేహమేనని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య లోవకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

లారీని ఢీకొన్న వ్యాన్.. నలుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదానికి గురైన వ్యాన్

కశింకోట, ఫిబ్రవరి 26: జాతీయ రహదారిపై మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం దిబ్బలివీధికి చెందిన ఆరుగురు వ్యక్తులు అన్నవరం పుణ్యక్షేత్రానికి టాటా ఏస్ వ్యాన్‌లో వెళుతున్నారు. కశింకోట వచ్చే సరికి ముందు వెళుతున్న లారీ డ్రైవర్ ఆకస్మికంగా బ్రేకులు వేశాడు. దీంతో లారీ వెనుక భాగాన్ని వ్యాన్ ముందు భాగం ఢీకొన్నది. ఈ ప్రమాదంలో అమనాన చక్రపాణి, అమనాన భాగ్యరేఖ, సకలబత్తుల పావని, అలుపాని శ్రీనివాసరావు(డ్రైవర్) తీవ్రంగా గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


జగన్నాథం మృతదేహం

ఎలమంచిలి, ఫిబ్రవరి 26: ఒడిశా నుంచి తెలంగాణ ప్రాంతానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడు.. ఎలమంచిలి మండలం పురుషోత్తపురం జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ సింహాచలం అందించిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా రంభ గ్రామానికి చెందిన తురాయి జగన్నాథం(26) తెలంగాణ రాష్ట్రం మణుగూరులోని కేసీపీ పరిశ్రమలో సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం తన అన్న ద్విచక్ర వాహనం తీసుకుని సొంతూరు నుంచి మణుగూరుకు బయలుదేరారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పురుషోత్తపురం సమీపంలో వాహనం అదుపు తప్పి డివైడర్‌పై వున్న స్తంభాన్ని బలంగా ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ చెప్పారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

▸▸ మేడ పైన ఆడుకుంటూ విద్యుత్ వైర్లు పట్టుకోవడంతో ఘటన

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 26: వడ్డాదిలో విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రాజస్థాన్‌కి చెందిన జాలంసింగ్, అతని సోదరుడు చందనసింగ్ రాథోడ్ వడ్డాదిలో హార్డ్‌వేర్, ప్లంబింగ్ వ్యాపారం చేస్తున్నారు. జాలంసింగ్‌కి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు యువరాజ్‌సింగ్ రాథోడ్(10) ఓ ప్రైవేటు స్కూల్‌లో ఐదవ తరగతి చదువుతున్నాడు. పెద్ద కుమారుడికి ఎఫ్ఏ-4 పరీక్షలు జరుగుతుండడంతో ఆ బాలుడిని జాలంసింగ్ తన సోదరుడి ఇంటి వద్ద వదిలి బంధువుల వివాహానికి భార్య, చిన్న కుమారుడితో రాజస్థాన్ వెళ్లాడు. సోమవారం సాయంత్రం బాబాయి ఇంటి మేడపై ఆడుకుంటున్న యువరాజ్ సింగ్ ఇంటికి సమీపంలో ఉన్న విజయరామరాజుపేట ఫీడర్ 11 కేవీ లైన్ వైర్లను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై పెద్దగా కేకలు పెట్టాడు. కేకలు విన్న బాబాయ్ చందనసింగ్ రాథోడ్ కర్రతో యువరాజ్‌సింగ్ రాథోడ్‌ని కొట్టి వైర్ల నుంచి తప్పించాడు. చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆ బాలుడు మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని కుటుంబీకులు, బంధువులు రాజస్థాన్ తీసుకువెళ్లినట్టు తెలిసింది.

తొమ్మిదో తరగతి విద్యార్థినిపై పీఈటీ అత్యాచారం

▸▸ గర్భం దాల్చడంతో బయటపడిన విషయం
▸▸ నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
▸▸ పోక్సో చట్టం కింద కేసు నమోదు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విశాఖలో మరో దారుణం వెలుగు చూసింది. కార్పొరేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై అదే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ)గా పనిచేస్తున్న వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో కీచక ఉపాధ్యాయుడి బాగోతం బయటపడింది. దీనికి సంబంధించి పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధురవాడ ప్రాంతంలోని ఒక కార్పొరేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను పీఈటీగా పనిచేస్తున్న బేరా దుర్గాప్రసాద్ (35) మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. సెలవు రోజుల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు ఉన్నాయంటూ బాలికను పాఠశాలకు పిలిపించి అఘాయిత్యానికి పాల్పడేవాడు. ఈ క్రమంలో బాలికకు రెండు రోజుల కిందట కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు..గర్భవతిగా నిర్ధారించడంతో పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు ఇచ్చినట్టు పోలీసులు తెలిపారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఎన్నికల వేళ డబ్బు, మద్యం రవాణాపై నిఘా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

▸▸ కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 26: రానున్న ఎన్నికల్లో నల్లధనం, అక్రమ మద్యం అరికట్టడానికి అవసరమైన నిఘా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగదు తరలింపుపై నిఘా పెట్టాలని, అనుమతులు లేకుండా పరిమితికి మించి నగదు రవాణా చేస్తుంటే ఆదాయ పన్ను శాఖకు సమాచారం ఇచ్చి చట్ట ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ) ఎన్నికల ప్రకటన తేదీ నుంచి పనిచేయడం ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్‌టీఆర్ బాబ్జీ, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.సునీత, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమారి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ డి. రామ్మూర్తి, డీటీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

దారంతా మురుగుమయం

▸▸ సబ్బవరం ప్రధాన రహదారులపై ప్రవహిస్తున్న మురుగునీరు
▸▸ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో అవస్థలు
▸▸ టీడీపీ హయాంలో ప్రారంభించిన భూగర్భ డ్రైనేజీ పనులు నిలిచిపోవడంతో ఇక్కట్లు

సబ్బవరం, ఫిబ్రవరి 26: సబ్బవరంలోని ప్రధాన రహదారులు మురికి కూపాలుగా మారాయి. గతంలో ఇక్కడ నిర్మించిన డ్రైనేజీలు ఆక్రమణకు గురికావడంతో ఇళ్లల్లోని వాడుక నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు వైసీపీ అధికారంలోకి వచ్చాక నిలిచిపోవడంతో ఈ ప్రాంతవాసులకు అవస్థలు తప్పడం లేదు.

సబ్బవరం ఎన్టీఆర్ సర్కిల్ నుంచి చోడవరం వెళ్లే రోడ్డు, పెందుర్తి వైపు వచ్చే రోడ్డు, అటు అనకాపల్లి వెళ్లే రోడ్డు, జోడుగుళ్ల నుంచి షీలానగర్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆర్ అండ్ బీ స్థలాలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. గతంలో నిర్మించిన డ్రైనేజీలను సైతం పూడ్చేసి కొందరు నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఇళ్లల్లోని వాడుక నీరు పోయే దారి లేక రోడ్లపై ప్రవహిస్తోంది. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది.


సబ్బవరంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

నిలిచిన భూగర్భ డ్రైనేజీ పనులు

టీడీపీ ప్రభుత్వ హయాంలో సబ్బవరంతో పాటు ఎనిమిది గ్రామాలను కలుపుతూ 29 కిలో మీటర్ల మేర భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి రూ.24.46 కోట్లు మంజూరయ్యాయి. 2018 డిసెంబరు 27న అప్పటి పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సాయినగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. 2019 జనవరిలో కాంట్రాక్టరు పనులు ప్రారంభించారు. అయితే ఆ తరువాత ఎన్నికలు జరగడం, వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి.


బేడ బుడగ జంగాల కాలనీ వద్ద ఇలా..

ఆక్రమణల తొలగింపు బాధ్యత రెవెన్యూశాఖదే

రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు, డ్రైనేజీలపై నిర్మాణాలను తొలగించాల్సిన బాధ్యత రెవెన్యూశాఖదేనని ఆర్ అండ్ బీ ఏఈ కృష్ణారావు తెలిపారు. ఇప్పటికే ఆక్రమణలపై సర్వే చేసి హద్దులు నిర్ణయించామని, దీనిపై తహసీల్దార్‌కు రెండు సార్లు లేఖలు రాశామన్నారు. ఆక్రమణలను తొలగించాల్సిన బాధ్యత రెవెన్యూశాఖ దేనని, అవసరమైతే తాము ఎక్స్‌కవేటర్లను సమకూరుస్తామని ఆయన చెప్పారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

▸▸ అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ


సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 : సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. కైలాసగిరి కొండ కింద ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బందికి నిర్వహిస్తున్న మొబలైజేషన్ ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడారు. వృతిపరమైన, వ్యక్తిగత క్రమశిక్షణ నిబద్ధతతో పని చేసి పోలీసు ప్రతిష్ఠను నిలపాలన్నారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో శాంతి భద్రతలు కాపాడే క్రమంలో సిబ్బంది సివిల్ పోలీసులకు వెన్నుదన్నుగా నిలవాలని చెప్పారు. అనంతరం ఆయన ఇటీవల విజయవాడలో పలు రాష్ట్రాల పోలీసు జాగిలాల 32వ ఆర్మీ కోర్సులో భాగంగా జరిగిన పోటీల్లో మత్తు పదార్థాల గుర్తించడంలో ప్రథమ బహుమతి పొందిన అల్లూరి సీతారామ రాజు జిల్లా జాగిలం రాఖీ, పేలుడు పదార్థాలను గుర్తించడంలో రెండో బహుమతి పొందిన అనకాపల్లి జిల్లా పోలీసు జాగిలం వోల్గా ట్రైనర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. తొలుత ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణరావు, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు, డీఎస్పీ నాగేశ్వరరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

'మద్య నిషేధంపై మాట తప్పిన జగన్'

అనకాపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మద్య నిషేధంపై మాటతప్పిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం రేట్లు మూడు రెట్లు పెంచడమే కాకుండా నాసిరకం మద్యం విక్రయిస్తూ రూ.2 లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నాసిరకం మద్యం తాగడం వల్ల రాష్ట్రంలో 30 లక్షల మంది అనారోగ్యం పాలవగా, 30 వేలమంది మృతిచెందారని పేర్కొన్నారు. మద్య నిషేధంపై మాట నిలుపుకోని జగన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.

రైల్వే అభివృద్ధి పనులు ప్రారంభం

▸▸ ఎలమంచిలి స్టేషన్‌లో రూ.13.13 కోట్ల పనులకు భూమి పూజ
▸▸ అందుబాటులోకి ఐదు అండర్‌పాస్ వంతెలు
▸▸ వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ


ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రమణమూర్తిరాజు, పప్పల చలపతిరావు, సుందరపు విజయకుమార్, రైల్వే అధికారులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 26: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలోని అనకాపల్లి జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో రైల్వే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడానికి ఎల్ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో రూ.13.13 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ములకలాపల్లి, తురంగలపాలెం వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, అధికార, అనధికార ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డీసీఎం మహ్మద్ అలీ ఖాన్, జేఆర్‌సీ మెంబర్ శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరావు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ యు.సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ ఛైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, ఆరైపు గుప్తా, తదితరులు పాల్గొన్నారు.


నక్కపల్లి మండలం పెదబోదిగల్లం సభలో మాట్లాడుతున్న ఎస్‌సీఆర్ ఏపీవో పి.శ్రీనాథ్


పాయకరావుపేట మండలం పీఎల్‌పురం వద్ద ప్రారంభించిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి

పెదబోదిగల్లం రైల్వే అండర్ పాస్ ప్రారంభం

నక్కపల్లి : మండలంలోని పెదబోదిగల్లం రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు వద్ద కొత్తగా నిర్మించిన అండర్ పాస్‌ను సోమవారం మధ్యాహ్నం దక్షిణ మధ్య రైల్వే ఏపీవో శ్రీనాథ్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నాజీ, ఎంఈవో కె.నరేశ్, హైస్కూల్ హెచ్ఎం చోడిశెట్టి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పీఎల్‌పురం, నామవరం వద్ద..

పాయకరావుపేట రూరల్ : మండలంలోని పి.ఎల్.పురం, నామవరం గ్రామాల వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్‌లను దక్షిణ మధ్య రైల్వే ఏడీఈ (ఆపరేషన్స్) సోమవారం పి.ఎల్.పురం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 50 అండర్ బ్రిడ్జిలను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.స్వప్న, డి.టి. రాజేంద్రప్రసాద్, సర్పంచ్ పడాల సోమన్నదొర, ఎంపీటీసీ సభ్యురాలు నాగం వెంకటరత్నం, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

దార్లపూడి సమీపంలో...

ఎస్.రాయవరం: మండలంలోని దార్లపూడి సమీపంలో భీమవరం గ్రామ వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని సోమవారం పీఎం నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏటికొప్పాక గ్రామానికి చెందిన పద్మశ్రీ పురస్కారగ్రహీత సీవీ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ అనకాపల్లి పార్లమెంట్ కన్వీనర్ వర్మ, సర్పంచ్ శుభాషిణి, ఎంపీటీసీ సభ్యులు దేవుడమ్మ, అప్పయ్యమ్మ, రైల్వే అధికారి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉత్తరాంధ్రలో నారా భువనేశ్వరి పర్యటన



విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'నిజం గెలవాలి' (చంద్రబాబునాయుడు అరెస్టు కావడాన్ని తట్టుకోలేక మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను ఓదార్పు) కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం అధినేత సతీమణి నారా భువనేశ్వరి మంగళవారం నుంచి ఒకటో తేదీ వరకు ఉత్తరాంధ్రలో పర్యటించనున్నారు. ఆమె మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడ నుంచి నేరుగా పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు వెళతారు. కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందిస్తారు. మంగళవారం రాత్రికి అరకులోయ చేరుకుని బస చేస్తారు. బుధవారం అరకులోయ, పాడేరు నియోజకవర్గాల్లో కార్యకర్తల కుటుంబాలను కలిసి ఆర్థిక సాయం అందించి రాత్రికి నర్సీపట్నం చేరుకుని బస చేస్తారు. ఈనెల 29వ తేదీన నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల్లో పర్యటించి రాత్రికి అనకాపల్లి చేరుకుంటారు. మార్చి ఒకటో తేదీన అనకాపల్లి, ఎలమంచిలి నియోజకవర్గాల్లో కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి సాయం అందజేస్తారు. అక్కడ నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని విమానంలో చెన్నై వెళతారు.

సిటీ క్లబ్ అక్రమ నిర్మాణాలపై చర్యలు ఏవీ?

▸▸ మునిసిపల్ కమిషనర్‌ను నిలదీసిన ఆర్డీవో
▸▸ గతంలో చెప్పినా పట్టించుకోలేదంటూ ఆగ్రహం
▸▸ వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశం


నర్సీపట్నం క్లబ్ అక్రమ నిర్మాణాలపై మునిసిపల్ కమిషనర్ రవిబాబును (కుడివైపు నిల్చున్న వ్యక్తి) నిలదీస్తున్న ఆర్డీవో జయరామ్

నర్సీపట్నం, ఫిబ్రవరి 26 : గ్రామ కంఠం స్థలంలో సిటీ క్లబ్ వారు వాణిజ్య భవన సముదాయం నిర్మిస్తుంటే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆర్డీవో హెచ్‌వీ జయరామ్, మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబును నిలదీశారు. గ్రామ కంఠం స్థలంలో అక్రమంగా షాపులు నిర్మిస్తున్నారని నర్సీపట్నంకు చెందిన పాకలపాటి అరవింద్‌కుమార్ రాజు, కాళ్ల లోవ సోమవారం ఇక్కడ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆయన అక్కడే వున్న మునిసిపల్ కమిషనర్‌ని ఉద్దేశించి మాట్లాడుతూ, గతంలో కూడా ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవాలని చెప్పామని, ఎందుకు వెనకడుకు వేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు డబ్బులు తీసుకొని చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయని ఆర్డీఓ అన్నారు. కమిషనర్ రవిబాబు మాట్లాడుతూ, వాణిజ్య భవన సముదాయం నిర్మాణంపై సిటీ క్లబ్ నిర్వాహకులకు నోటీసులు ఇచ్చామని బదులిచ్చారు. దీంతో తీవ్ర అసహనం చెందిన ఆర్డీవో జయరామ్.. తక్షణమే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించాలి

▸▸ కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 26: స్పందన కార్యక్రమంలో ప్రజలు అందజేసే అర్జీలకు సంబంధించి సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జేసీ జాహ్నవి, డీఆర్వో బి.దయానిధితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యపై 336 అర్జీలు అందాయి. వీటిని సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ అర్జీని తిరస్కరిస్తే.. ఇందుకు కారణం కూడా తెలియజేయాలన్నారు. భూసమస్యలు, రేషన్‌కార్డుల మంజూరుకు సంబంధించి అర్జీలు అధికంగా వస్తున్నాయని, సంబంధిత అధికారులు వీటిపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, సీపీవో రామారావు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.


స్పందనలో అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి

జిల్లా పోలీస్ కార్యాలయంలో...



జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిరూరల్: జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురి సమస్యలను స్వయంగా ఆలకించారు. మొత్తం 22 అర్జీలు అందగా, అనంతరం వాటిని సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అర్జీలను త్వరగా పరిష్కరించి, వీటిపై తీసుకున్న చర్యల గురించి నిర్ణీత గడువులోగా నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణరావు, ఎస్ఐ టి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో పీలా సోదరులు భేటీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడితో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఆయన సోదరుడు పీలా శ్రీనివాసరావు భేటీ అయ్యారు. అనకాపల్లి అసెంబ్లీ సీటుపే జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణకు కేటాయించడంతో పీలా గోవింద సత్యనారాయణ ఆదివారం విజయవాడలో చంద్రబాబును కలిశారు. అయితే పీలా గోవింద సత్యనారాయణ కుటుంబీకులను బుజ్జగించాలని చంద్రబాబు భావించారు. ఈ క్రమంలో శ్రీకాకుళం జిల్లాలో కదలిరా సభకు హాజరైన చంద్రబాబు తిరుగుప్రయాణంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. అయితే ఎయిర్‌పోర్టుకు పీలా గోవింద సత్యనారాయణ, పీలా శ్రీనివాస్‌లను తీసుకురావాలని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు చంద్రబాబు సూచించారు. దీంతో గోవింద సత్యనారాయణ, పీలా శ్రీనివాస్‌లను తీసుకుని వెలగపూడి సోమవారం రాత్రి ఎయిర్‌పోర్టుకు వచ్చారు. పీలా సోదరులతో చంద్రబాబు వీఐపీ లాంజ్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఏం మాట్లాడింది బయటకు వెల్లడికాలేదు.

సంయమనంతో ఉండండి

▸▸ టీడీపీ శ్రేణులకు పీలా గోవింద సూచన


మాట్లాడుతున్న పీలా గోవింద సత్యనారాయణ

అనకాపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం క్రమశిక్షణగల పార్టీ అని, కార్యకర్తలు సంయమనం పాటించాలని నియోజకవర్గం ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ కోరారు. పొత్తులో భాగంగా అనకాపల్లి అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించడం, అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ పేరు ప్రకటించడంతో పీలా గోవింద ఆదివారం ఉండవల్లి వెళ్లి చంద్రబాబునాయుడును కలిశారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో పలువురు టీడీపీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, పార్టీ అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యానని, ఆయనతో జరిగిన చర్చల వివరాలను రెండు, మూడు రోజుల్లో వెల్లడిస్తానని చెప్పారు. అనంతరం శ్రీకాకుళం పర్యటన ముగించుకుని విశాఖ విమానాశ్రయానికి రానున్న చంద్రబాబును కలిసేందుకు విశాఖపట్నం వెళ్లారు.

జనసేనలో చేరిన మాజీ కౌన్సిలర్లు


కొణతాల సమక్షంలో పార్టీలో చేరిన మాజీ కౌన్సిలర్లు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 26: జనసేన అనకాపల్లి నియోజకవర్గ అభ్యర్థి కొణతాల రామకృష్ణ సమక్షంలో ఇద్దరు మాజీ కౌన్సిలర్లు సోమవారం జనసేన పార్టీలోకి చేరారు. పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు వడ్డాది శ్రీదేవి, మావూరి లక్ష్మి పార్టీలోకి చేరగా, వీరికి కొణతాల జనసేన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

'వ్యవసాయ రంగాన్ని పరిరక్షించాలి'


ఆందోళన చేస్తున్న రైతు సంఘ ప్రతినిధులు

నక్కపల్లి, ఫిబ్రవరి 26: వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సోమవారం ఏపీ రైతు సంఘం ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 26 నుంచి 29వ తేదీ వరకూ అబుదాబిలో జరగనున్న డబ్ల్యూటీవో సమావేశంలో వ్యవసాయరంగం సుభిక్షంగా వుండే నిర్ణయాన్ని కేంద్రం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.రాజేశ్, జి. వెంకటరమణ పాల్గొన్నారు.

విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పూజలు

నక్కపల్లి, ఫిబ్రవరి 26: స్థానిక వీవర్స్ కాలనీలో కొత్తగా నిర్మించిన విఘ్నేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సరస్వతి, విఘ్నేశ్వరుడు, భక్త మార్కండేయ విగ్రహాలకు జలాభిషేకం చేశారు. వేదపండితులు కుమారస్వామి శర్మ, పీసపాటి శేషాచార్యులు ఆధ్వర్యంలో పండితులు పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులతో సామూహిక పూజలు చేయించారు. అనంతరం మహిళల ఆధ్వర్యంలో 108 కలశలతో విగ్రహాలకు అభిషేకం చేశారు.

పలువురు టీడీపీ నేతలకు అనిత పరామర్శ

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 26: మండలంలోని రాజయ్యపేట, పెదరాంభద్రపురంల్లో ఇటీవల మృతి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుల కుటుంబాలను సోమవారం తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత పరామర్శించారు. రాజయ్యపేటలో మాజీ వైస్ సర్పంచ్ యాదాల నూకరాజు తండ్రి ఇటీవల మృతి చెందారు. అదేవిధంగా పెదరాంభద్రపురం మాజీ సర్పంచ్ కలిగట్ల శ్రీను చిన్నాన్న ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను ఆమె పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు గొర్లె రాజబాబు, యాళ్ల వరహాలు, బొంది కాశీవిశ్వనాథ్, మజ్జూరి నారాయణరావు, నాగు, దువ్వ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. పాయకరావుపేటలో తుమ్మలపల్లి రామారావు కుమారుడు ఇటీవల మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత సోమవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు పల్లా విలియంకేరి, ముంజులూరి దుర్గాప్రసాద్, కశింకోట సత్తిబాబు, వేములపూడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ. 1.5 లక్షలు విరాళం

నక్కపల్లి, ఫిబ్రవరి 26: నక్కపల్లిలో కొత్తగా నిర్మించిన విఘ్నేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న పూజా కార్యక్రమాల నిమిత్తం పాయకరావుపేటకు చెందిన ఇందుకూరు సుధాకర్‌రాజు రూ1.05 లక్షలు విరాళాన్ని సోమవారం అందజేశారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ ద్వారా ఆయన ఆలయానికి వచ్చి ఈ మొత్తాన్ని అందజేశారు. సుధాకర్‌రాజును సత్కరించారు.

స్వతంత్రంగా ఎన్నికల బరిలో ఉంటాం

» అఖిల భారతీయ యాదవ మహాసభ అధ్యక్షుడు లాకా


విలేకరులతో మాట్లాడుతున్న వెంగళరావు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 26 : రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించకపోతే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తామని అఖిల భారతీయ యాదవ మహాసభ అధ్యక్షుడు లాకా వెంగళరావుయాదవ్ పేర్కొన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో యాదవులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. తమ సామాజికవర్గం ప్రతినిధులు అనకాపల్లి ఎంపీగా ఎస్.అప్పలరాజు, అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాల్లో ఏదో ఒకచోట యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భరణికాన బాబూరావు పోటీలో ఉంటారన్నారు. విలేకరుల సమావేశంలో సంఘ నాయకులు భరణికాన బాబూరావు, భరణికాన నరసింహమూర్తి, సబ్బి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు దిబ్బపాలెంలో నూకాలమ్మ జాతర

అచ్యుతాపురం, ఫిబ్రవరి 26: సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం)లో మంగళవారం నూకాలమ్మ జాతరను నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ బైలపూడి శ్రీరామదాసు తెలిపారు. రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలకు చెందిన సుమారు 24 గ్రామాలకు చెందిన నిర్వాసితులు అమ్మవారి పండగలో పాల్గొంటారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశామని ఆయన తెలిపారు.

జనసైనికులను పరామర్శించిన కొణతాల

కశింకోట, ఫిబ్రవరి 26 : మండలంలోని పలు గ్రామాల్లో అనకాపల్లి జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ సోమవారం పర్యటించారు. తాళ్లపాలెంలో అనారోగ్యం బారిన పడిన జనసైనికుడు తోరం గణేష్, ఇటీవల ప్రమాదానికి గురైన జమాదులపాలెం ఎంపీటీసీ మాజీ సభ్యుడు కరక రాజుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. అనంతరం కశింకోట రేజేటి రామాచార్యులు సతీమణి దివంగతులైన కారణంగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాడ సానుభూతిని తెలియజేశారు.

ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి

» టీడీపీ క్లస్టర్, యూనిట్,బూత్ ఇన్‌చార్జిల సమావేశంలో అనిత



సమావేశంలో మాట్లాడుతున్న అనిత

నక్కపల్లి, ఫిబ్రవరి 26: ఎప్పుడైనా ఎలక్షన్ నోటిఫికేషన్ రావచ్చునని, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వుండాలని పాయకరావుపేట టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని వంగలపూడి అనిత సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక తన నివాసం వద్ద నిర్వహించిన టీడీపీ బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిల సమావేశంలో ఆమె మాట్లాడారు. నారా లోకేశ్ ఆదేశాల మేరకు సూపర్ సిక్స్ పథకాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్పించుకుని ఇంటింటికీ స్టిక్కర్లు పంపిణీ చేయాలన్నారు. ఇదే సమయంలో వైసీపీ శ్రేణులు దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, జానకి శ్రీను, అమలకంటి అబద్ధం, పెదిరెడ్డి చిట్టిబాబు, లాలం కాశీనాయుడు, ఏజెర్ల వినోద్‌రాజు, కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి కొండబాబు, బుజ్జి, గుర్రం రామకృష్ణ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతో అధిక దిగుబడులు

» ఆత్మ శిక్షణ శిబిరంలో ఇన్‌చార్జి ఏడీఆర్ ముకుందరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి (అగ్రికల్చర్), ఫిబ్రవరి 26: చెరకులో అధిక దిగుబడుల సాధనకు ఆధునిక సాంకేతిక సాగు పద్ధతులను ఉపయోగించాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు రైతులను కోరారు. ఆత్మ ఆధ్వర్యంలో సోమవారం పరిశోధనా స్థానంలో ప్రారంభమైన సాంకేతిక పద్ధతుల శిక్షణ శిబిరంలో ఆయన ప్రసంగించారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో దిగుబడులు పెంచేందుకు అవసరమైన శిక్షణనిస్తారన్నారు. ఒంటి కన్ను ముచ్చెలను వినియోగించడం వల్ల చెరకు దిగుబడులు బాగా పెరుగుతాయని చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి వివరించారు. జంటచాళ్ళు, అంతర పంటల సాగు వంటి పద్ధతుల సాయంతో చెరకులో 25 శాతం అధికంగా దిగుబడులు సాధించవచ్చని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కేవీ.రమణమూర్తి చెప్పారు. శాస్త్రవేత్తలు విశాలాక్షి, శ్రీదేవి, గౌరి, సీతారామలక్ష్మి, ఉమామహేశ్వరరావు తదితరులు శిక్షణ ఇచ్చారు.

కనీస వేతనాలు అమలు చేయాలని కార్మికుల ఆందోళన

» తహసీల్దార్, సీఐలకు వినతిపత్రాలు


ఆందోళన చేస్తున్న కార్మికులు

రాంబిల్లి, ఫిబ్రవరి 26: ఎన్ఏఓబీ నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ఎల్అండ్‌టీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. తొలుత కార్మికులు నేవీ ప్రధాన గేటు వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, జి.దేముడునాయుడు మాట్లాడుతూ గత ఏడేళ్లుగా ఎల్అండ్‌టీలో పనిచేస్తున్న కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తున్నారన్నారు. ఐదేళ్ల సర్వీసు ఉన్న కార్మికులకు గ్రాట్యూటీ ఇవ్వడం లేదని, లీవ్‌పే చెల్లించడం లేదన్నారు. నేవీ లోపల 12 గంటలు పనిచేసే కార్మికులకు నాణ్యమైన భోజనం పెట్టకపోవడంతో అనారోగ్యపాలవుతున్నారన్నారు. ఉన్నతాధికారులు సమస్యలను పరిష్కరించకపోవడంతో ఆందోళనకు దిగడం జరిగిందన్నారు. ఈ మేరకు వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్, సీఐలకు అందజేశారు.

యువత దేశభక్తిని అలవరచుకోవాలి : ముర్రు



సమావేశంలో మాట్లాడుతున్న ముర్రు ముత్యాలనాయుడు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 26: యువత దేశభక్తిని అలవరచుకోవాలని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నెహ్రూ యువకేంద్రం నిర్వహించిన నైబర్‌హుడ్ పార్లమెంట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువతతో దేశ ముఖ చిత్రాన్ని మార్చవచ్చునన్నారు. ప్రతి ఒక్కరు దైవ, దేహ, దేశభక్తిలను కలిగి ఉండాలన్నారు. నెహ్రూ యువకేంద్రం యువ అధికారి గొర్లె మహేశ్వరరావు నైబర్‌హుడ్ పార్లమెంట్ విశిష్టతను, కేంద్ర యువజన శాఖ యువత కోసం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. బార్క్ సీనియర్ సైంటిస్ట్ ఎంవీ సూర్యనారాయణ మాట్లాడుతూ సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా యువత మరిన్ని విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్, ఎన్.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

» డివిజనల్ ప్రెసిడెంట్ పి.రామ్‌గోపాల్


రైల్వే పెన్షనర్స్ ప్రతినిధులను సత్కరిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, ఫిబ్రవరి 26: రైల్వే పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆలిండియా రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ విజయవాడ డివిజనల్ ప్రెసిడెంట్ పి.రామ్‌గోపాల్ అన్నారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఎలమంచిలి సంఘం సెక్రటరీ ఏ.రామ్మోహనరావు అధ్యక్షతన జరిగిన రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే కార్మికుల సమస్యలపై (ఏఐఆర్ఎఫ్) అసోసియేషన్ వందేళ్ల నుంచి పోరాటం చేస్తుందన్నారు. ఏప్రిల్ 24వ తేదీకి వందేళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో ఢిల్లీలో వందేళ్ల కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. అనంతరం సంఘ ప్రతినిధి కేవీ.రమణారావు మాట్లాడుతూ పెన్షనర్స్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అనకాపల్లిలో సాగర్ ప్రతినిధిగా నూతన బ్రాంచిను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సీహెచ్.కృపయ, జి.రాంబాబు, స్థానిక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కె.కాశీ విశ్వేశ్వరావు, ఏ.రామ్మోహనరావు, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రతినిధులు రవికుమార్, శ్రీనివాసరావు, పెన్షనర్స్ పాల్గొన్నారు.

అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

ఎలమంచిలి బ్రాంచి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.కాశీవిశ్వేశ్వరావు, కార్యదర్శి ఏ.రామ్మోహనరావు, ట్రెజరర్ ఏ. నూకరాజు, జాయింట్ సెక్రటరీ పి. అప్పారావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా కేఆర్‌వీ. కృష్ణారావు, ఎస్. నూకరాజు, సహాయ సెక్రటరీలుగా ఈ.వీరన్న, కె.నారాయణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీఎస్‌వీ. ప్రసాదరావు ఎన్నికైనట్టు తెలిపారు.

ఘనంగా మల్లికార్జునస్వామి ఊరేగింపు

సబ్బవరం, ఫిబ్రవరి 26 : మండలంలోని పెదనాయుడుపాలెం దరి గణపతిపురంలో గణపతి భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి పసిడి కలశ, నవగ్రహ, నందీశ్వర, కాలభైరవస్వామి వార్ల విగ్రహాల ఊరేగింపు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఇరువాడ జంక్షన్ వద్ద గల శివాంజనేయ ఆలయం వద్ద నుంచి గణపతిపురం వరకు ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా రక్ష సూత్రధారణ, మండపం ఆవాహన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

రామ్‌నగర్‌లో రైల్వే అండర్ పాస్‌ను ఏర్పాటు చేయాలి

ఎలమంచిలి, ఫిబ్రవరి 26: మునిసిపాలిటీ రామ్‌నగర్ రైల్వే గేటు సమీపంలో ఏడు గ్రామాలకు చెందిన ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు రైల్వే అండర్ పాస్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం రైల్వే డీఆర్ఎం ఆలీఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ రైల్వే గేటు వద్ద రైళ్ల రాకపోకలు సమయంలో గేటు మూసివేస్తున్న కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ గేటు మీదుగా రామ్‌నగర్, శ్రీరామ్‌నగర్, పెదపల్లి, గొల్లలపాలెం, పెదగొల్లలపాలెం, నవాబ్‌పేట, శేషకొండ కాలనీ, మంత్రిపాలెం, వెంకటాపురం ప్రాంతాల ప్రజలు నిత్యం ఎలమంచిలికి రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. ఇక్కడ అండర్ పాస్ నిర్మించాలని కోరుతూ దాసరి కుమార్, టిడ్కో సముదాయం ప్రతినిధులు ప్రసాద్, ఐ. రామ్ వినతి పత్రం అందజేశారు.

పంచదార్ల భూముల రీ సర్వే నిలుపుదల చేయాలి

» స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

రాంబిల్లి, ఫిబ్రవరి 26: మండలంలోని పంచదార్ల పంచాయతీలో ప్రభుత్వం చేపడుతున్న భూముల రీ సర్వేను నిలుపుదల చేయాలని అప్పారాయుడుపాలెంకు చెందిన నానేపల్లి సన్యాసిరావు సోమవారం కలెక్టర్ స్పందనలో వినతిపత్రాన్ని అందజేశారు. రీ సర్వేలో రాజకీయ పలుకుబడి ఉన్నవారు కొంతమంది సర్వే అధికారులను ఉపయోగించుకొని నిజమైన భూ యజమానుల పేరు నమోదు చేయకుండా వారికి అనుకూలంగా ఉన్న వ్యక్తుల పేర్లను రికార్డులో నమోదు చేయించుకొని భూకబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అవగాహన లేని సర్వే అధికారులు రాజకీయ భూ కబ్జాదారుల ప్రలోభాలకు లొంగి భూ యజమానులకు నష్టం చేస్తున్నారన్నారు. మద్రాసు ఉమ్మడి రాజధానిగా ఉండేటప్పుడు పంచదార్ల రెవెన్యూలో దేవదాయ శాఖ రిజిస్టర్ నంబరు 22లో 350 ఎకరాలు ఉండేదని, ప్రస్తుత దేవదాయ శాఖ రిజిస్టర్ నంబరు 43లో 120ఎకరాల భూమి మాత్రమే ఉందన్నారు. ఇందులో సుమారు 200 ఎకరాలు గతంలో కబ్జాకు గురైందని, మరో 20 ఎకరాలు జిరాయితీ భూములుగా మార్చుకుని క్రయవిక్రయాలు చేస్తున్నారన్నారు. దేవదాయ శాఖ చెందిన రూ.200 కోట్లు విలువైన భూములు కబ్జాకు గురయ్యాయని, వీటిని రక్షించాలని ఆయన కోరారు.

ఎన్ఏఓబీలో కార్మికుల సమ్మెను పరిష్కరించాలి : సీఐటీయూ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 26 : ఎన్ఏఓబీలో పనిచేస్తున్న ఎల్అండ్ టీ కార్మికుల సమ్మెను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశరక్షణ రంగానికి సంబంధించి ఎన్ఏఓబీలో నిర్మాణానికి ఎల్అండ్‌టీ పది వేల మంది కార్మికులను పనిలో పెట్టుకుని నిర్మాణం చేస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనాలు అమలు కావడం లేదని 300 మంది కార్మికులు సమ్మెకు దిగారన్నారు. కనీసం క్యాంటీన్ సౌకర్యం కూడా లేదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పింఛన్‌దారుల వార్షికోత్సవ సమావేశం రేపు

పరవాడ, ఫిబ్రవరి 26 : రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల 12వ వార్షికోత్సవ సమావేశాన్ని స్థానిక మరిడిమాంబ కల్యాణమండపంలో బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నట్టు సంఘం మండల అధ్యక్షుడు ఆదిరెడ్డి సన్నిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారుల సమస్యలపై చర్చించడంతోపాటు సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న కార్యాచరణ గురించి వక్తలు ప్రసంగించడం జరుగుతుందన్నారు. సమావేశానికి పరవాడ, అగనంపూడి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ పింఛన్‌దారులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

'రైతాంగాన్ని అణగదొక్కేలా ప్రభుత్వ విధానాలు'


నెహ్రూచౌక్‌లో ఆందోళన చేపడుతున్న దృశ్యం

తుమ్మపాల, ఫిబ్రవరి 26 : రైతాంగాన్ని పూర్తిగా అణగదొక్కేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఉన్నాయని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు ఆరోపించారు. సంయుక్త కిసాన్‌మోర్చ, ఏపీ రైతు సంఘాల సమన్వయ పిలుపులో భాగంగా సోమవారం నెహ్రూచౌక్‌లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు.ఢిల్లీలో రైతుల ఉద్యమంపై దమనకాండను, కాల్పులను ప్రయోగించి రైతులను పొట్టన పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు కర్రి అప్పారావు, గండి నాయనబాబు, శంకరరావు, సదాశివరావు,పీఎస్ అజయ్‌కుమార్, కనిశెట్టి సురేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు పంచగ్రామాల నల్లమారమ్మతల్లి పండుగ


సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కొత్తూరు, ఫిబ్రవరి 26: అనకాపల్లి మండలంలోని రామాపురం, బీఆర్‌టీ కాలనీ, రామభద్రపురం, నల్లమారమ్మ దిబ్బల కాలనీ, సుబ్రహ్మణ్యం కాలనీల్లో పంచగ్రామాల నల్లమారమ్మ తల్లి పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. రామాపురం గ్రామాన్ని ఆనుకొని ఉన్న కేబీ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. పండుగను పురస్కరించుకొని పురవీధుల్లో పిండివంటలను ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యంగా సమర్పించారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

అచ్యుతాపురం, ఫిబ్రవరి 26: క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ, హీరో మోటార్స్ సంయుక్తంగా తిమ్మరాజుపేట పాఠశాలలో సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 8 సంవత్సరాల వయసు గల పిల్లలకు తిమ్మరాజుపేట సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి భర్త శివ బాపునాయుడు హెల్మెట్‌లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమలో మల్ల నాగేశ్వరరావు, మారిశెట్టి వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనపై విపక్షాలు దుష్ప్రచారం: వైవీ సుబ్బారెడ్డి


అనకాపల్లిలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

అనకాపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టినా ప్రతిపక్షాలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని ఆ పార్టీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రావు గోపాలరావు కళాక్షేత్రంలో అనకాపల్లి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి నుంచి పోటీ చేస్తున్న మలసాల భరత్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. మంత్రి అమర్‌నాథ్‌కు జగన్మోహన్‌రెడ్డి తగిన గౌరవం ఇస్తారన్నారు. మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ అనకాపల్లి నియోజకవర్గంలో దశాబ్దకాలంగా కనిపించని నాయకుడిని పోటీ పెడుతున్నారంటూ పరోక్షంగా కొణతాల రామకృష్ణను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై తొలిసారిగా అనకాపల్లి వచ్చిన వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావులకు స్థానిక ఎన్టీఆర్ కూడలి వద్ద వైసీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. సభలో ఎంపీ సత్యవతి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మందపాటి జానకిరామరాజు, విప్ కరణం ధర్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

టీడీపీ, జనసేన పార్టీల హామీలను ప్రజలు నమ్మవద్దని వైసీపీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని అడ్డరోడ్డులో సోమవారం జరిగిన సిద్ధం సభలో ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసీపీని ప్రజలు గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్‌లను ఎమ్మెల్యేలు జోగులు, ఎంపీ గొల్ల బాబూరావు కలిసి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సత్యవతి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు,మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూడిమడక జాతర


జగన్నాథస్వామి ఆలయం వద్ద మిఠాయి దుకాణాలు

అచ్యుతాపురం ఫిబ్రవరి 26: పూడిమడకలో మాఘ పౌర్ణమి జాతర కొనసాగుతోంది. మరో ఐదు రోజులపాటు జాతర జరుగుతుంది. ఇక్కడ జగన్నాథస్వామి ఆలయం వద్ద ఇత్తడి, సిల్వర్, స్టీల్, గాజులు, చెప్పులు, ఆట, ఫ్యాన్సీ వస్తువులు, స్వీట్లు, ఖర్జూరం వంటి దుకాణాలు ఏర్పాటుచేశారు. మత్స్యకారులు తాము ఏడాది పొడవునా దాచుకున్న డబ్బులతో వస్తువులను భారీగా కొనుగోలు చేస్తారు. ఇంటికి వచ్చిన బంధు, మిత్రులకు గాజులు, కొత్త చెప్పులు, ఖర్జూరం, ఆట వస్తువులతోపాటు భారీగా స్వీట్లు కొని తిరిగి వారి గ్రామాలకు పంపుతారు. ఇది అనాదిగా వస్తున్న ఆచారం. వ్యాపారులు ఈ ఐదు రోజులు ఇక్కడ విక్రయించడానికి లారీలపై సరుకును తెస్తారు. తాము తెచ్చిన సరుకును పూర్తిగా విక్రయించిన తర్వాతే ఇక్కడ నుంచి వెళతారు. ఆదివారం నుంచి భారీగా విక్రయాలు జరుగుతున్నాయి.

కొణతాలకు మహలక్ష్మినాయుడు మద్దతు


కొణతాల రామకృష్ణను సత్కరిస్తున్న మహలక్ష్మినాయుడు

కొత్తూరు, ఫిబ్రవరి 25: అనకాపల్లి జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణకు గౌరీ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కర్రి మహలక్ష్మినాయుడు మద్దతు ప్రకటించారు.సోమవారం కొణతాల క్యాంపు కార్యాలయంలో కలిసి కండువా కప్పి సంఘీభావం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం పార్టీ విజయానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో విల్లూరి ధర్మరాజు, బుద్ద తాతారావు, బుద్ద సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

పరవాడ, ఫిబ్రవరి 26: వాడచీపురుపల్లి రామచంద్రమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఆదివారంరాత్రి నిర్వహించిన జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. తొలుత మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు విశాఖ, అనకాపల్లి, విజయనగరం, కాకినాడ జిల్లాల నుంచి 50 జట్లు పాల్గొన్నాయి. ఒకటి, రెండు, మూడు, నాలుగు స్థానాల్లో తుని, ఎస్.కోట, నర్సీపట్నం, తానాం జట్లు విజయం సాధించాయి. విజేతలకు మంగళవారం నగదు బహుమతులు అందజేస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు కూండ్రపు శ్రీనివాసరావు, బురద అప్పలరాజు, కూండ్రపు అప్పారావు, రమణమూర్తి, కె.అప్పారావు, గండి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గ ఆలయానికి దొరస్వామి విరాళం


నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న దొరస్వామి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 26: హరిపాలెంలో నూతనంగా నిర్మించిన విజయదుర్గ ఆలయానికి బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి సొంత నిధుల నుంచి రూ.లక్ష వెయ్యి నూటపదహార్లు విరాళంగా ఇచ్చారు. సోమవారం నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొని విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి సూర్యనారాయణ, వెంకటసీతారాం, శరగడం లక్ష్మీజ్యోతిర్మయి, శరగడం అప్పలనాయుడు పాల్గొన్నారు.

యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

కశింకోట, ఫిబ్రవరి 26 : స్థానిక యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం పురాతన ఆంధ్ర కల్వరి సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో జరిగింది. అధ్యక్షుడిగా రెవ కె.నన్సీజేమ్స్, కార్యదర్శిగా కె.జాన్‌బాబు, కోశాధికారిగా బి.ఇసాక్, గౌరవాధ్యక్షుడిగా రెవ సీహెచ్ ప్రకాష్, చైర్మన్‌గా ఎం.రాంబాబు, ఉపాధ్యక్షుడిగా అమోస్, ఉపకార్యదర్శిగా పి.అబ్రహం, ఉపకోశాధికారిగా బి.ఎఫినెటలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పెదకలవలాపల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రాంబిల్లి, ఫిబ్రవరి 26: పెదకలవలాపల్లి కొండ చుట్టూ డీఆర్‌డీవో అధికారులు ప్రహరీ గోడ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు సీహెచ్ శివాజీ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గ్రామంలో నిరసన చేస్తున్న మహిళా రైతులను పరామర్శించి, తమ మద్దతును తెలిపారు. రైతులు పొలాలకు వెళ్లే దారులను మూసి వేయడం సరికాదన్నారు. ప్రత్యామ్నాయం చూపించడంతోపాటు, నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని శివాజీ డిమాండ్ చేశారు.



రాజుకున్న రాజకీయ వేడి

... 5వ పేజీ తరువాయి

పలుకుతూ సోమవారం అనకాపల్లిలో జరిగిన నియోజకవర్గం వైసీపీ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి... అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మలసాల భరత్‌కుమార్‌కు పోటీ చేసే అవకాశాన్ని సీఎం జగన్ కల్పించారని ప్రకటించారు. ఆయన విజయానికి అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దీంతో రానున్న ఎన్నికల్లో జిల్లా అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అధికార వైసీపీ నుంచి మలసాల భరత్‌కుమార్, ప్రతిపక్ష టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ పోటీ చేయడం దాదాపు ఖాయమైంది.

కదం తొక్కిన సర్పంచులు

... 5వ పేజీ తరువాయి

సర్పంచులకు, పోలీసులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం సర్పంచుల నుంచి వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, జిల్లా నాయకులు యేజర్ల వినోద్‌రాజు, దాడి ఎరుకునాయుడు, చింతకాయల ముత్యాలు, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.

ఈసారీ లక్ష్యానికి దూరమే!

... 5వ పేజీ తరువాయి

తగ్గిపోవడంతో క్రషింగ్ లక్ష్యాన్ని రెండు లక్షలకు తగ్గించారు. గత ఏడాది డిసెంబరు 15న గోవాడలో క్రషింగ్ లాంఛనంగా ప్రారంభమైనప్పటికీ, డిసెంబరు 28 నుంచి రెగ్యులర్ క్రషింగ్ మొదలైంది. ఇంతవరకు సుమారు లక్షా 33 వేల టన్నుల చెరకు మాత్రమే క్రషింగ్ చేశారు. క్షేత్రస్థాయిలో చెరకు లభ్యత తగినంత లేకపోవడంతోపాటు, ఫ్యాక్టరీకి చెరకు సరఫరా కూడా తగ్గిపోవడంతో వచ్చే నెల 5వ తేదీతో క్రషింగ్‌ను ముగించాలని యాజమాన్యం నిర్ణయించింది. రానున్న వారం రోజుల్లో మరో 20 వేల టన్నులకు మించి చెరకు క్రషింగ్ జరిగే పరిస్థితి లేదు. అటుఇటుగా 1.5 లక్షల టన్నులు మాత్రమే క్రషింగ్ జరుగుతుందని భావిస్తున్నారు. ఇది లక్ష్యంలో 75 శాతం మాత్రమే కావడం గమనార్హం. ఫ్యాక్టరీ చరిత్రలోనే ఇదే అత్యల్ప క్రషింగ్‌గా రికార్డుల్లోకి ఎక్కుతుందని రైతులు అంటున్నారు. వచ్చే సీజన్‌లో ఫ్యాక్టరీ నడుస్తుందా? లేక మూతపడుతుందా? అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. ఉత్పన్నం అవుతున్నాయి

ఇదిలావుండగా చెరకు సరఫరా చేసిన వెంటనే డబ్బులు చెల్లిస్తామని యాజమాన్యం చెప్పినప్పటికీ, ప్రస్తుత సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. ఆ ప్రభావం చెరకు సరఫరాపై పడింది. పలువురు చెరకు రైతులు పొరుగు జిల్లాలకు చెందిన షుగర్ ఫ్యాక్టరీలకు విక్రయించేశారు. ఇది కూడా క్రషింగ్ లక్ష్యంపై ప్రభావం చూపింది.

రాష్ట్రంలో ప్రజల మానప్రాణాలకు రక్షణ కరువు

▸ ప్రజా పోరుయాత్రలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు



కృష్ణాదేవిపేటలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 26 : ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న వైసీపీని రానున్న ఎన్నికల్లో ప్రజలంతా సాగనంపాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో సోమవారం నిర్వహించిన ప్రజా పోరుయాత్రలో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎన్నెన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశ ప్రజలందరికీ బాసటగా నిలుస్తుందన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ప్రజల మానప్రాణాలకు రక్షణ కరువైయ్యిందని ఆయన ఆరోపించారు. కేంద్ర పథకాలను రాష్ట్ర పథకాలుగా చెప్పుకోవడం దారుణమని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి అంతా కృషి చేయాల్సిందిగా కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శులు వర్మ, కొండబాబు, యువమోర్చా రాష్ట్ర నాయకులు అడిగర్ల సతీష్, నాయకులు తామరాన ఎర్రినాయుడు, గవిరెడ్డి త్రినాథ్, పార్టీ గొలుగొండ మండల అధ్యక్షుడు చందక గౌరినాయుడు, వెలగా జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట మండలంలో...

రోలుగుంట : కేంద్రం అమలు చేస్తున్న పథకాలకు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం స్టిక్కర్లు వేసుకుని సొంత డబ్బా కొట్టుకుంటుందని బీజేపీ మండల అధ్యక్షుడు కర్రి తమ్మునాయుడు అన్నారు. మండలంలోని వడ్డిప, రత్నంపేట గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పోరు యాత్రలో మాట్లాడారు. వైసీపీ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఆ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. నాయకులు జగదీష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'మాడుగులలో టీడీపీని గెలిపించుకుంటాం'



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 26 : మాడుగుల నియోజకవర్గంలో టీడీపీ అధిష్ఠానం ఎమ్మెల్యే సీటు ఎవరికి ఇచ్చినా గెలిపించి, చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తామని ఆ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తీర్మానం చేశారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర శాఖకు పంపించారు. టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ అధ్యక్షతన మండలంలోని పెదనందిపల్లిలో సోమవారం కార్యకర్తల అభిప్రాయ సేకరణ చేపట్టారు. కొందరు మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మరికొంతమంది పీవీజీ కుమార్, ఇంకొందరు పైలా ప్రసాదరావు పేర్లను ప్రస్తావించారు. ఈ ముగ్గురిలో ఎవరికి టిక్కెట్ ఇచ్చినా కష్టపడి పనిచేసి గెలిపించుకుని తీరుతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు పోతల పాత్రునాయుడు, చెరకాన సూర్యనారాయణ, నానాజీ, సోమిరెడ్డి గోవింద, పాచిల కృష్ణ, పెంటకోట అప్పలనాయుడు, కడిం నాగేశ్వరరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టవానిపాలెంలో పరదేశమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకు వెళుతున్న భక్తులు

రావికమతం, ఫిబ్రవరి 26 : మట్టవానిపాలెంలో మంగళవారం పరదేశమ్మ తల్లి పండగ జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ వేడుకను పురస్కరించుకుని గ్రామంలోని సుమారు 150 మంది వరకు భక్తులు అమ్మవారి మాలలను ధరించి నెలరోజులుగా దీక్షలు చేస్తున్నారు. ఇదిలావుంటే, సోమవారం అమ్మవారికి సారెను సమర్పించారు. మహిళలు ఇళ్లలో తయారు చేసిన వివిధ రకాల పిండి వంటలను ఊరేగింపుగా తీసుకు వెళ్లి నైవేద్యంగా సమర్పించి అందరికీ పంచిపెట్టారు.

సబ్ సెంటర్‌ను పరిశీలించిన టాస్క్‌ఫోర్స్ బృందం

రావికమతం,ఫిబ్రవరి 26 : కొత్తకోట పీహెచ్‌సీ పరిధిలోని జెడ్.కొత్తపట్నం ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం తనిఖీ చేసింది. ముందుగా రికార్డులను క్షుణంగా పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. కొందరు సిబ్బంది రికార్డులు సక్రమంగా లేకపోవడంతో వారికి తగిన సూచనలు చేశారు. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. డాక్టర్ లూసీ, డీపీహెచ్ఎన్‌వో నాగమణి, డీపీవో జగదీష్, ఎస్‌వో రామచంద్రరావుతో పాటు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు రజని, సురేఖ, ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు పాల్గొన్నారు.

కదం తొక్కిన సర్పంచులు

... 5వ పేజీ తరువాయి

సర్పంచులకు, పోలీసులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం సర్పంచుల నుంచి వైసీ సుబ్బారెడ్డికి వినతిపత్రం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైబీవీ రాజేంద్రప్రసాద్, జిల్లా నాయకులు యేజర్ల వినోద్‌రాజు, దాడి ఎరుకునాయుడు, చింతకాయల ముత్యాలు, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.

రాజుకున్న రాజకీయ వేడి

... 5వ పేజీ తరువాయి

పలుకుతూ సోమవారం అనకాపల్లిలో జరిగిన నియోజకవర్గం వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి... అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మలసాల భరత్‌కుమార్‌కు పోటీ చేసే అవకాశాన్ని సీఎం జగన్ కల్పించారని ప్రకటించారు. ఆయన విజయానికి అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దీంతో రానున్న ఎన్నికల్లో జిల్లా అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అధికార వైసీపీ నుంచి మలసాల భరత్‌కుమార్, ప్రతిపక్ష టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ పోటీ చేయడం దాదాపు ఖాయమైంది.

ఈసారీ లక్ష్యానికి దూరమే!

... 5వ పేజీ తరువాయి

తగ్గిపోవడంతో క్రషింగ్ లక్ష్యాన్ని రెండు లక్షలకు తగ్గించారు. గత ఏడాది డిసెంబరు 15న గోవాడలో క్రషింగ్ లాంఛనంగా ప్రారంభమైనప్పటికీ, డిసెంబరు 28 నుంచి రెగ్యులర్ క్రషింగ్ మొదలైంది. ఇంతవరకు సుమారు లక్షా 33 వేల టన్నుల చెరకు మాత్రమే క్రషింగ్ చేశారు. క్షేత్రస్థాయిలో చెరకు లభ్యత తగినంత లేకపోవడంతోపాటు, ఫ్యాక్టరీకి చెరకు సరఫరా కూడా తగ్గిపోవడంతో వచ్చే నెల 5వ తేదీతో క్రషింగ్‌ను ముగించాలని యాజమాన్యం నిర్ణయించింది. రానున్న వారం రోజుల్లో మరో 20 వేల టన్నులకు మించి చెరకు క్రషింగ్ జరిగే పరిస్థితి లేదు. అటుఇటుగా 1.5 లక్షల టన్నులు మాత్రమే క్రషింగ్ జరుగుతుందని భావిస్తున్నారు. ఇది లక్ష్యంలో 75 శాతం మాత్రమే కావడం గమనార్హం. ఫ్యాక్టరీ చరిత్రలోనే ఇదే అత్యల్ప క్రషింగ్‌గా రికార్డుల్లోకి ఎక్కుతుందని రైతులు అంటున్నారు. వచ్చే సీజన్‌లో ఫ్యాక్టరీ నడుస్తుందా? లేక మూతపడుతుందా? అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. ఉత్పన్నం అవుతున్నాయి

ఇదిలావుండగా చెరకు సరఫరా చేసిన వెంటనే డబ్బులు చెల్లిస్తామని యాజమాన్యం చెప్పినప్పటికీ, ప్రస్తుత సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. ఆ ప్రభావం చెరకు సరఫరాపై పడింది. పలువురు చెరకు రైతులు పొరుగు జిల్లాలకు చెందిన షుగర్ ఫ్యాక్టరీకు విక్రయించేశారు. ఇది కూడా క్రషింగ్ లక్ష్యంపై ప్రభావం చూపింది.

రహదారుల్లో రాకాసి రంధ్రాలు

▸ గతంలో కురిసిన భారీ వర్షాలు, పరిమితికి మించిన బరువుతో భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతిన్న రోడ్లు ▸ కల్వర్టులు ఉన్నచోట మరింత ప్రమాదకరం ▸ పట్టని అధికారులు



కశిమి సమీపంలో కల్వర్టు వద్ద బీటలువారిన రహదారి



కల్వర్టు వద్ద పడిన రంధ్రం

గొలుగొండ, ఫిబ్రవరి 26 : నర్సీపట్నం నియోజకవర్గంలోని పలు రహదారులపై ప్రయాణం అంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. కల్వర్టులు ఉన్నచోట్ల రాకాసి రంధ్రాలు భయపెడుతున్నాయి. పరిమితికి మించిన బరువుతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడమే ఇందుకు కారణంగా పలువురు వాపోతున్నారు.

గొలుగొండ మండలంలోని కశిమి గ్రామం వద్ద రహదారి అత్యంతదారుణంగా మారింది. ఇక్కడి కల్వర్టు కోతకు గురికావడంతో పాటు రోడ్డు బీటలు వారింది. దీంతో రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది డిసెంబరు మొదటి వారంలో ఏర్పడిన తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు కశిమి, చినకశిమి గ్రామాల మధ్యలో గల కల్వర్టు వద్ద రాళ్ల గెడ్డ పొంగి ప్రవహించింది. దీంతో కల్వర్టు అడుగు భాగం భారీగా కోతకు గురైంది. నాటి నుంచి పట్టించుకునేవారు కరువయ్యారు. దీనికితోడు ఈ రోడ్డుపై పరిమితికి మించి లోడ్లతో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో చాలాచోట్ల అస్తవ్యస్తంగా మారి బీటలు వారింది. మూడు నెలల క్రితం జడ్పీటీసీ సుర్ల వెంకటగిరిబాబు, పీఆర్ అధికారులు కలిసి కోతకు గురైన కల్వర్టును పరిశీలించి, త్వరలో మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. నేటివరకు కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా ఇటుగా రాకపోకలు అంటేనే పలువురు వాహనచోదకులు హడలిపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కల్వర్టుకు, రహదారికి మరమ్మతులు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

రాజుపేట రోడ్డులో ప్రయాణం భయం..భయం..

మాకవరపాలెం, ఫిబ్రవరి 26 : నర్సీపట్నం నుంచి తాళ్లపాలెం వెళ్లే రూటులోని రాజుపేట వద్ద రోడ్డు మధ్యలో కల్వర్టుకు భారీ రంధ్రం పడడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరుచూ ఈ రోడ్డు ద్వారా పయనీర్ కంపెనీకి చెందిన భారీ వాహనాలు ముడిసరకులను తీసుకుని వస్తుంటాయి. అవి పరిమితికి మించిన లోడ్లతో రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్లు బలహీనపడుతున్నాయి. దీంతో చిన్నచిన్న కల్వర్టులు ఉన్న చోట రంధ్రాలు పడుతుండడంతో పాటు పలుచోట్ల రోడ్లు కూడా దెబ్బతింటున్నాయని అంటున్నారు. ఇందులో భాగంగానే రాజుపేట గ్రామం వద్ద ఉన్న కల్వర్టు ప్రదేశంలో రంధ్రం పడిందని పేర్కొంటున్నారు. ఈ రూటులో పగటి పూట ప్రయాణం చేసేవారు కల్వర్టు వద్ద పరిస్థితిని గుర్తిస్తున్నారు. రాత్రివేళ ఇబ్బందులు తలెత్తుతున్నట్టు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి, కల్వర్టు వద్ద రంధ్రం పడినచోట మరమ్మతులు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.



రాజుపేట వద్ద రోడ్డుపై ఉన్న రంధ్రం

చెట్టుపల్లి గ్రామ సమీపంలో...

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 26 : మండలంలోని చెట్టుపల్లి పెట్రోల్ బంకు సమీపంలో గల ఆర్అండ్‌బీ రహదారి వద్ద గల కల్వర్టుకు భారీ రంధ్ర పడింది. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నర్సీపట్నం-చోడవరం వెళ్లే ఈ మార్గం నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ రంధ్రం పడి నెలలు గడుస్తున్నా కన్నెత్తిచూసేవారు కరువయ్యారని పలువురు వాపోతున్నారు. రంధ్రం ఉన్న చిన్నపాటి కర్రకు ఎర్రటి గుడ్డ కట్టడంతో పగలు రాకపోకలు సాగించేవారు ఇక్కడ ప్రమాదాన్ని సూచించే హెచ్చరిక ఉందని గుర్తిస్తున్నారు. రాత్రి వేళ వచ్చే వాహనదారులు మాత్రం గుర్తించలేకపోతున్నారు. దీనికితోడు ఈ ప్రాంతంలో చీకడిపడితే అంధకారం అలము కుంటుంది. అటువంటప్పుడు వాహనచోదకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పెట్రోల్ బంకు సమీపంలోని రోడ్డుపై రంధ్రం

మద్య నిషేధంపై మడమ తిప్పిన సీఎం జగన్

▸ టీడీపీ నాయకుడు బత్తుల తాతయ్యబాబు ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 26 : మద్యంపై ఆదాయం అంటే ప్రజల రక్తమాంసాలతో వ్యాపారం చేయడమేనని ప్రతిపక్ష నేత హోదాలో చెప్పిన జగన్, అధికారం చేపట్టాక ఇప్పుడు అవే రక్తమాంసాలను తాకట్టు పెట్టి మరీ అప్పులు చేస్తున్నారని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు మండిపడ్డారు. వడ్డాదిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యపానం వల్ల లక్షల జీవితాలు నాశనమవుతున్నాయన్న ఆయనే, ప్రజలలోని కొందరి బలహీనతను అడ్డం పెట్టుకుని ఆదాయాన్ని పెంచుకుంటున్నారని విమర్శించారు. ఆ రాబడిని హామీగా చూపించి రూ.వేల కోట్ల రుణాలు తెస్తున్నారన్నారు. అదే డబ్బుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తామంటూ చట్టాల్నే సవరించుకున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. మద్యం అక్రమ వ్యాపారం మొత్తం జగన్‌రెడ్డి, పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి సిండికేట్ ద్వారానే జరుగుతుందని తాతయ్యబాబు ఆరోపించారు. నాసిరకం మద్యం పోవాలన్నా, మహిళల మాంగళ్యాలు కాపాడాలన్నా రానున్న ఎన్నికల్లో ప్రజలంతా వైసీపీని ఓడించాలని తాతయ్యబాబు పిలుపునిచ్చారు.

'నాతవరం మండలంలో రూ.4.91కోట్ల ధాన్యం బకాయిలు'



రైతుల వివరాలను నమోదు చేసుకుంటున్న రవితేజ

నాతవరం, ఫిబ్రవరి 26 : మండలంలోని ధాన్యం రైతుల బకాయిలు త్వరలో ప్రభుత్వం విడుదల చేయనుందని పౌర సరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ రవితేజ తెలిపారు. సోమవారం ఇక్కడి రైతు భరోసా కేంద్రంలో మండలంలో గల వ్యవసాయ సహాయాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఎఫ్‌సీఐకి చెందిన అధికారి హెచ్.తిరుపతి రావుతో కలిసి రైతు భరోసా కేంద్రాలకు ధాన్యం సరఫరా చేసిన రైతుల వివరాలు, బకాయి తదితరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాతవరం మండలంలో గత నెల జనవరి తొమ్మిదో తేదీ నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు ధాన్యం సరాఫరా చేసిన 519 రైతులకు రూ.4.91 కోట్లను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ఈ వారంలో ఖాతాల్లో నగదు జమ కానుందని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



తురకబడిలో ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన అధికారులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 26 : పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను అధికారులు సోమవారం పరిశీలించారు. రామారావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎలిమెంట్రీ స్కూల్, పంచాయతీ రాజ్ కార్యాలయం, వెంకునాయుడుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యుత్, మరుగుదొడ్లు, నీరు, దివ్యాంగులకు ర్యాంప్, ప్రహరీ గోడ తదితరాలపై ఆరా తీశారు. అనంతరం సెక్టార్ ఆఫీసర్, తాండవ డీఈఈ అనురాధ, సెక్టార్ పోలీస్ ఆఫీసర్ ఏఎస్ఐ సాంబశివరావు, బీఎల్‌వో హిందులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో లోపాలు ఉంటే జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక అందజేస్తామన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు

మాడుగుల, ఫిబ్రవరి 26 : మేజర్ పంచాయతీ మాడుగుల పరిధిలోని పారిశుధ్య కార్మికులకు సోమవారం సాయంత్రం రూ.2.5 లక్షలు వేతనాలను సర్పంచ్ ఎడ్ల కళావతి, పంచాయతీ కార్యదర్శి చీపురుపల్లి నాయుడు అందజేశారు. పట్టణాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా తీర్చిదిద్దాలని వారికి సూచించారు.

మాడుగుల డీటీగా లక్ష్మయ్య



మాడుగుల, ఫిబ్రవరి 26: ఇక్కడి డిప్యూటీ తహసీల్దార్‌గా డి.లక్ష్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఈ స్థానంలో ఉన్న పి.సత్యనారాయణకు చోడవరం తహసీల్దార్ కార్యా లయానికి బదిలీ అయ్యింది.

ముగిసిన కేశవ స్వామి కల్యాణోత్సవాలు



పుష్పాలంకరణలో స్వామివారు, అమ్మవార్లు

చోడవరం, ఫిబ్రవరి 26 : పట్టణంలోని కేశవ స్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. చివరి రోజుల పుష్పాంజలిని జరిపారు. తొలుత శ్రీదేవి, భూదేవి సమేత స్వామిని పుష్పాలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. స్థానిక పెద్దలు ఉపాధ్యాయుల శ్రీనివాస్, ఉప్పల బాబులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

'స్పందన'కు 19 మంది అర్జీలు సమర్పణ

నర్సీపట్నం, ఫిబ్రవరి 26 : ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి డివిజన్‌లోని వివిధ గ్రామాల నుంచి పలువురు విచ్చేసి సమస్యలను వివరించారు. వీరి వద్ద నుంచి ఆర్డీవో జయరాం అర్జీలను స్వీకరించారు. నర్సీపట్నానికి చెందిన రుత్తల శేషుకుమారి ఆర్డీవోతో మాట్లాడుతూ నాతవరం మండలం గుమ్మిడిగొండలో 1-బి సర్వే నెంబరు 260, 261, 262 లలో తనకు పసుపు కుంకుమ కింద పుట్టింటివారు ఇచ్చిన ఐదెకరాలు, తన తల్లి సోములమ్మ పేరిట ఉన్న మరో ఐదెకరాల భూమిని చింతకాయల అరుణాదేవి పేరు మీద తహసీల్దార్ తప్పుడు రికార్డులు సృష్టించారని ఆరోపించారు. దీనిపై సర్వే చేసి న్యాయం చేయాల్సిందిగా కోరారు. అలాగే, మాకవరపాలెం మండలం బయ్యవరంలో 25 శాతం ప్రభుత్వ రాయితీపై రూ.15 లక్షలతో రైతు ఉత్పత్తిదారుల కలెక్షన్ కేంద్ర భవన నిర్మాణం చేపట్టామని, తొలుత రూ.5లక్షలు మంజూరు చేశారని, రూ.6.25 లక్షలకు పంచాయతీరాజ్ జేఈ ఎంబుక్ చేయడం లేదని ఆడారి సూరిబాబు విన్నవించారు. మరికొంత మంది తమ సమస్యలను తెలిపారు. 19 అర్జీలు అందినట్టు కార్యాలయం అధికారులు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ



విద్యార్థినికి ప్లాంక్ అందిస్తున్న ఎస్ఐ నాగేంద్ర

దేవరాపల్లి, ఫిబ్రవరి 26 : ఎం.అలమండ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు హాజరు కానున్న విద్యార్థులకు ఎస్ఐ డి.నాగేంద్ర సోమవారం ప్లాంక్‌లు, పరీక్ష కిట్‌లను పంపిణీ చేశారు. దేవరాపల్లికి చెందిన బట్టలు వ్యాపారి బాలు కుమారుడు వీటిని సమకూర్చారు. ఎంఈవో పడాల్ దాసు, కె.వీరమణ. కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠాపురంలో దుర్గమ్మ గుడి ప్రారంభం



అమ్మవారు

బుచ్చెయ్యపేట/చోడవరం, ఫిబ్రవరి 26 : నీలకంఠాపురంలో సోమవారం దుర్గమ్మ ఆలయం ప్రారంభమైంది. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఈ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ధర్మశ్రీ, జడ్పీటీసీ రాంబాబుతో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. ఇదిలావుంటే, చోడవరం మండలం కన్నంపాలెంలో శ్రీకృష్ణుని ఆలయాన్ని ఎమ్మెల్యే ధర్మశ్రీ ప్రారంభించారు. వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, వైసీపీ మండల అధ్యక్షుడు డి.వెంకటరావు, డీసీసీబీ డైరెక్టర్ మూడెడ్ల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అడివిరాజుల బాబు విగ్రహాల ప్రతిష్ఠ



మాకవరపాలెం, ఫిబ్రవరి 26 : చినరాచపల్లిలో నిర్మించిన అడివిరాజుల బాబు గుడిలో అడివిరాజుల విగ్రహాలను సోమవారం ప్రతిష్ఠించారు. గ్రామస్థులు సుమారు రూ.ఐదు లక్షలు చందాలను కూడబెట్టుకొని అక్కడి ఊటగెడ్డ రిజర్వాయర్ కింద గుడి నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది.

చెట్టుపల్లిలో పండగ

నర్సీపట్నం అర్బన్ : చెట్టుపల్లిలో సోమవారం అడివిరాజులబాబు పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలో గల గుడికి పెద్ద సంఖ్యలో భక్తులు వెళ్లి మొక్కులను తీర్చుకున్నారు. అలాగే పలువురు గ్రామస్థులు తమ పొలాల్లో చెట్లకు పూజలు జరిపారు.

బాల్య వివాహాల వల్ల అనర్థాలపై కళాజాత

కృష్ణాదేవిపేట/ బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 26 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం వారపు సంతలో సోమవారం కళాజాత నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంపై కళాకారులు అవగాహన కల్పించారు. సర్పంచ్ లోచల సుజాత, అంగన్‌వాడీ ఏఎల్‌పురం సెక్టార్ సూపర్ వైజర్ సత్యశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. అలాగే, బుచ్చెయ్యపేట మండలం మంగళాపురంలో ఇదే అంశంపై కళాజాత నిర్వహించారు. ఐసీడీఎస్ ఏసీడీపీవో పుష్ప, సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి, జీఎంఎస్‌కే మహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

రోలుగుంట, ఫిబ్రవరి 26 : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను సోమవారం మండలంలోని అడ్డసరం గ్రామంలో పంపిణీ చేశారు. ఈ పథకం కింద నలభై కనెక్షన్లు మంజూరు కాగా, ఆయా లబ్ధిదారులకు సర్పంచ్ విశారపు రమణాజీ అందజేశారు. స్థానిక నాయకులు విశారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

గొలుగొండ, ఫిబ్రవరి 26 : జోగంపేటలో విక్రయించేందుకు అక్రమంగా తీసుకు వెళుతున్న 12 క్వార్టర్ మద్యం బాటిళ్లను సోమవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు చిట్ల పార్వతి అనే మహిళ బ్యాగు తనిఖీ చేయగా, అందులో మద్యం బాటిళ్లను గుర్తించి కేసు నమోదు చేశామన్నారు.

మిస్టర్ ఆంధ్రా- 2024 రన్నరప్‌గా చోడవరం యువకుడు



మణికంఠను సత్కరిస్తున్న దృశ్యం

చోడవరం, ఫిబ్రవరి 26: ఆంధ్రా ఓపెన్ జోనల్ బాడీ బిల్డింగ్ కప్ పోటీల్లో 2024వ సంవత్సరానికి మిస్టర్ ఆంధ్రా రన్నరప్‌గా పట్టణానికి చెందిన కె.మణికంఠ నిలిచాడు. నేషనల్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ డైరెక్టర్ ఎస్.కె.బషీర్ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నంలో నిర్వహించిన పోటీల్లో మణికంఠ ద్వితీయ స్థానంలో నిలిచాడు. రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన మణికంఠను పట్టణానికి చెందిన గణేష్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ పుల్లేటి గణేష్‌తో పాటు, ప్రముఖులు అభినందించారు.

స్తంభం నేలకొరగడంతో ఓసీ కాలనీలో కరెంటు కష్టాలు

▸ కొత్తది వేయడానికి లైనేమేన్ లంచం అడిగారని సర్పంచ్, పలువురు స్థానికులు ఆరోపణ



బుచ్చెయ్యపేటలో నెలకొరిగిన స్తంభం

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 26 : మండల కేంద్రం బుచ్చెయ్యపేట ఓసీ కాలనీలో పడిపోయిన స్తంభం స్థానంలో కొత్తది వేసేందుకు లైన్‌మేన్ లంచం డిమాండ్ చేస్తున్నారని పలువురు వినియోగదారులతో పాటు సర్పంచ్ సుంకర లక్ష్మి, మాజీ సర్పంచ్ డొంకిన అప్పలనాయుడు ఆరోపించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల క్రితం తమ కాలనీలో సిమెంట్ విద్యుత్ స్తంభం పడిపోయిందన్నారు. దీంతో ఏపీ ట్రాన్స్‌కో అధికారులు పక్కనే ఉన్న టెలిఫోన్ స్తంభానికి తాత్కాలికంగా విద్యుత్ వైర్లను వేసి, సరఫరాను పునరుద్ధరించినట్టు చెప్పారు. సదరు టెలిఫోన్ స్తంభం కూడా దెబ్బతిందని విద్యుత్ అధికారులకు తెలిపినా స్పందించ లేదని వినియోగదారులు శనివాడ లక్ష్మి, గోవింద, మంగనాయుడు, బాలా, చిన్నమ్మలు, బాబు, ఈశ్వరరావు, అయితిరెడ్డి చిన్న, ముమ్మిడిశెట్టి లక్ష్మణరావు, మాటూరి సన్యాసమ్మలు తెలిపారు. ఇదిలావుంటే, శనివారం విద్యుత్ వైర్లు వేసిన టెలిఫోన్ స్తంభం కూలిపోయింది. దీనిపై స్థానిక లైన్‌మేన్ కొండలరావుకు ఫిర్యాదు చేయగా, నేలకూలిన స్తంభానికి ఉన్న విద్యుత్ వైర్లు, ఇంటి మీటర్ల కనెక్షన్లు కట్ చేసి వెళ్లిపోయారన్నారు. రూ.తొమ్మిది వేలు లంచం ఇస్తేనే కొత్త స్తంభం వేస్తామని ఆయన డిమాండ్ చేశారని వినియోగదారులు ఆరోపించారు. దీంతో మూడు రోజులుగా తాము చీకట్లో అలమటిస్తున్నామన్నారు. దీనిపై వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈఈ సోమరాజును వివరణ కోరగా, స్తంభం వేయానికి నగదు అవసరం లేదన్నారు. వినియోగదారులు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామన్నారు. లైన్‌మేన్‌ను వివరణ కోరగా, పడిపోయిన స్తంభం తమ శాఖది కాదన్నారు. కొత్త స్తంభం వేయాలంటే విద్యుత్ శాఖకు డీడీ కట్టాలని సర్పంచ్‌తో చెప్పానన్నారు. ఎంత అవుతుందని సర్పంచ్ అడగ్గా, రూ.తొమ్మిదివేలు అవుతుందని మాత్రమే చెప్పానన్నారు.